సాక్షి
అనంతపురం
సోమవారం । 11 । సెప్టెంబర్ । 2023



సంతల ఆదాయం రూ.3 లక్షలు

అనంతపురం మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.07 లక్షల ఆదాయం వచ్చింది.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6.50 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.3°/ 22.7°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఎక్కడా వర్షం కురవలేదు.

న్యూస్‌రీల్

పోలీసుల అప్రమత్తం

- జిల్లా అంతటా పటిష్ట బందోబస్తు
- అమలులోకి 144 సెక్షన్, 30 యాక్ట్



అనంతపురంలో ఆదివారం రాత్రి గస్తీ తిరుగుతున్న డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాస్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆదివారం ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆందోళన పేరిట రెచ్చగొట్టే అవకాశాలు ఉండటంతో టీడీపీ కీలక నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బృందాలతో బందోబస్తు నిర్వహించారు. అనంతపురంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డితో కలసి డీఐజీ ఆర్‌ఎన్ అమ్మిరెడ్డి టవర్‌క్లాక్ కూడలి వద్దకు చేరుకుని పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నాయన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. న్యాయ స్థానం తీర్పును గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

పోలీసుల కవాతు

డీఐజీ, ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు అనంతపురంలో ఆదివారం కవాతు నిర్వహించారు. ప్రజల భద్రతకు భరోసానిస్తూ ఈ కవాతు నగరంలో ప్రధాన రహదారులపై కొనసాగింది. సోమవారం టీడీపీ తలపెట్టిన బంద్ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని, ఎవ్వరూ ఉల్లంఘించరాదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేవారిపల్లెను ఊడ్చేశారు!

- 2014–19 మధ్య కాలంలో భారీగా నిధుల క్షైంకర్యం
- రూ.3 కోట్లకు పైగా తెలుగుదేశం పార్టీ నేతల జేబుల్లోకి
- నకిలీ రశీదు బుక్కులు సృష్టించి ప్రజల నుంచి పన్నుల వసూళ్లు
- అక్రమాలపై 40 మంది అధికారులతో విచారణకు ఆదేశం
- ఐదురోజులుగా పంచాయతీ పరిధిలో ఇంటింటా రశీదుల సేకరణ
- మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఆశ్రయించిన మాజీ, తాజా సర్పంచులు
- జిల్లాలోనే అతిపెద్ద కుంభకోణంగా పరిగణిస్తున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తాడిపత్రి పట్టణంలో భాగంగా ఉండే పంచాయతీ గన్నెవారిపల్లె. 3,500కు పైగా గడపలు. మంచి ఆదాయ వనరులున్న ఈ పంచాయతీని తెలుగుదేశం పార్టీ నేతలు చీపురుపట్టి ఊడ్చేశారు. 2014–19 మధ్య కాలంలో మూడు కోట్ల రూపాయలకుపైగా తమ జేబుల్లోకి వేసుకున్నారు. ఈ స్కాంలో నిందితులను కనుక్కునేందుకు ఏకంగా 40 మంది అధికారులను విచారణకు ఆదేశించారు.

ఆ సొమ్ము జేసీ అనుచరుల జేబుల్లోకి!

గన్నెవారిపల్లె పంచాయతీ ఇప్పటికీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గం చేతుల్లోనే ఉంది. 2014–19 వరకూ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులే సర్పంచ్. ప్రస్తుత సర్పంచ్ కూడా టీడీపీకి చెందిన వారే ఉన్నారు. కాగా పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును పంచాయతీకి జమ చేయకుండా స్వాహా చేశారు. ఏకంగా నకిలీ రశీదు బుక్కులు సృష్టించారు. ఇంటిపన్నులు మొదలుకొని కొళాయి పన్నుల వరకు అన్నింటికీ నకిలీ బిల్లులు సృష్టించి డబ్బు దండుకున్నారు. ఒక చిన్న రేకుల షెడ్డుకు కూడా రూ.3వేలు పన్ను వేశారు. కానీ ఆ డబ్బు ప్రభుత్వానికి జమ కాలేదు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఇందు కోసం 40 మంది అధికారుల బృందాన్ని నియమించారు. ఇంతమంది అధికారులతో విచారణ చేయించడాన్ని బట్టి చూస్తే ఇది జిల్లాలోనే అతిపెద్ద స్కాంగా అధికారులు భావిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి రశీదుల సేకరణ

గన్నెవారిపల్లె పంచాయతీ పరిధిలో జరిగిన పన్నుల స్వాహా ఘటనపై అధికారుల బృందం ఐదు రోజులుగా ఇంటింటికీ వెళ్లి రశీదులు సేకరిస్తున్నారు. పంచాయతీ వారు ఇచ్చిన రశీదులు, ఒరిజినల్ రశీదులను చూస్తే ఎక్కడా పోలికే లేదని విచారణలో పాల్గొన్న ఓ అధికారి చెప్పారు. ఐదు రోజులకు గాను 400 గడపలు మాత్రమే తిరిగారు. మిగతా ఇళ్లన్నీ తిరిగితే గానీ అసలు విషయం బయటపడదు. అక్కడున్న కుటుంబాలు కూడా ఈ రశీదులు నకిలీవో, నిజమైనవో తెలియక డబ్బులు కట్టేశారు. ఏడాదికి రూ.65 లక్షల చొప్పున ఐదేళ్ల పాటు రూ.3 కోట్ల పైబడి తినేసినట్టు ప్రాథమికంగా తేలింది.

జేసీని ఆశ్రయించిన మాజీ, తాజా సర్పంచులు

అధికారుల బృందం విచారణ చేపట్టడంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్‌లు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని ఆశ్రయించినట్టు తెలిసింది. ఈ స్కాంలో సర్పంచులు కీలక పాత్ర పోషించారు. కొంతమంది సిబ్బంది వీరికి సహకరించారు. ఇటు సర్పంచులు, కిందిస్థాయి సిబ్బంది కుమ్మక్కయ్యి పంచాయతీకి వచ్చే నిధులన్నీ తినేశారు. పైసా కూడా వ్యయం చేయకపోవడంతో గన్నెవారిపల్లె పంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. జేసీ ప్రభాకర్‌రెడ్డి నకిలీ బిల్లులు సృష్టించి ఎలా వాహనాలను అమ్మేశారో.. ఆయన అనుచరులు కూడా నకిలీ బిల్లులు సృష్టించి పంచాయతీ పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును అలా నొక్కేశారు.

అవినీతిపై ఫిర్యాదులు వచ్చాయి



గన్నెవారిపల్లె పంచాయతీలో నిధుల అవకతవకలపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదుల మేరకే నిజాలు నిగ్గు తేల్చేందుకు 40 మంది అధికారుల బృందం విచారణ చేస్తోంది. విచారణ నివేదికను బట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– గౌతమి, కలెక్టర్

కోర్టు తీర్పుతో బాబుకు చెంపదెబ్బ



మాట్లాడుతున్న ఉదయ్‌కిరణ్

గుంతకల్లు: మాటిమాటికీ చంద్రబాబునాయుడు తన వయస్సును చూపించి బయటపడాలని కుటిల ప్రయత్నం చేశారని, అయితే చట్టం ముందు అందరూ సమానులే అని కోర్టు తీర్పు ద్వారా చెంపదెబ్బ పడినట్లయ్యిందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డి.ఉదయ్‌కిరణ్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రులు, ప్రధానులు సైతం జైలుకు వెళ్లిన దాఖలాలు ఉన్నాయన్నారు. అనారోగ్యానికి గురైన లాలూ ప్రసాద్‌యాదవ్ జైలులోనే మగ్గిపోయారని గుర్తు చేశారు. తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదన్నారు. ఈ కేసులో అన్ని సాక్ష్యాలూ బలపడడంతోనే పాపం పండి చంద్రబాబును జైలుకు పంపారని పేర్కొన్నారు.

తప్పు చేసిన వారెవరూ తప్పించుకోలేరు



విష్ణువర్ధన్‌రెడ్డి

అనంతపురం/రాప్తాడు రూరల్ : చట్టాలు చేయాల్సిన హోదాలో ఉన్నవారు తప్పులు చేయడం బాధాకరమని పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఏ స్థాయిలో ఉన్నవారైనా సరే తప్పు చేస్తే చట్టం ముందు తప్పించుకోలేరనేది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విషయంలో స్పష్టమైందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పక్కా ఆధారాలు ఉండడంతోనే ఏసీబీ కోర్టు ఆయనకు రిమాండ్‌కు విధించిందన్నారు.

అవినీతిపరులకు శిక్ష తప్పదు



అశోక్‌కుమార్‌రెడ్డి

'అవినీతి అక్రమాలపై విచారణ జరగకుండా మాజీ సీఎం చంద్రబాబు స్టేలు తెచ్చుకుంటూ వచ్చారు. ఇలాంటివి ఎంతోకాలం సాగవు అని తేలిపోయింద'ని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఆధారాలన్నీ పక్కాగా ఉండటంతో చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ఎన్నటికైనా అవినీతి పరులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు.

అవినీతి అనకొండకు రిమాండ్ సరైనదే



మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: 'ప్రజాధనాన్ని లూటీ చేసిన స్కిల్ స్కాంలో న్యాయమే గెలిచింది. 'స్కిల్' నిందితుడిగా ఉన్న చంద్రబాబునాయుడిపై పేదలు విజయం సాధించారు. ఆర్థిక నేరాల్లో అవినీతి అనకొండ చంద్రబాబుకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ సరైనదే'నని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. కళ్యాణదుర్గంలోని మంత్రి స్వగృహంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు 2014లో సీఎం పదవి చేపట్టాక విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలకు తెరలేపారన్నారు. ఆయన అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తోందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని రుజువైందన్నారు. చంద్రబాబు రిమాండ్‌కు వెళ్లడంతో ఎన్టీఆర్ ఆత్మ సంతోషిస్తుందని వ్యాఖ్యానించారు. చేసిన తప్పులకు చంద్రబాబు శిక్ష అనుభవించాల్సిందేనన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసి కేసులు విచారణ జరగకుండా ఎన్నిసార్లు స్టేలు తీసుకొచ్చినా ఎప్పుడో ఒకసారి విచారణ జరగకమానదన్నారు. అప్పుడు సాక్ష్యాధారాలతో నేరం రుజువైనప్పుడు శిక్ష పడక తప్పదని అన్నారు.

బాబుది నేరపూరిత కుట్ర



ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: నేరపూరిత కుట్రల ద్వారానే చంద్రబాబు ప్రజాధనాన్ని భారీగా దోచుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం రాత్రి 'సాక్షి'తో మాట్లాడారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కుంభకోణంలో పక్కా ఆధారాలతోనే సీఐడీ అధికారులు అరెస్టు చేశారన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లు అక్రమాలు, అవినీతి, దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడుతూ.. ఎక్కడా దొరక్కుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చారన్నారు. తనను ఎవ్వరూ ఏమీ చేయలేరని చెప్పుకుంటూ వచ్చారన్నారు. చివరకు పక్కా ఆధారాలతో దొరికిపోయారన్నారు. ఇంకా కోర్టు స్టేలతో ఆగిన కేసులన్నింటినీ విచారణ చేస్తే.. అందులో పడే శిక్షలకు చంద్రబాబు జీవితకాలం సరిపోదన్నారు. 'స్కిల్' కుంభకోణంలో లోకేశ్ పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తోందని, ఆయన కూడా నోరుజారకుండా చూసుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో ఉండాలంటే మంచివారితో ఉండాలని టీడీపీ నాయకులకు హితవుపలికారు.

తీర్పును తప్పు పట్టడం అర్థరహితం



చట్టం ముందు అందరూ సమానులే. నియమ, నిబంధనల ప్రకారమే జడ్జి తీర్పు వెలువరించారు. ప్రొసీజర్ ప్రకారం విధించిన రిమాండ్‌ను టీడీపీ, ఆ పార్టీ అనుకూల న్యాయవాదులు తప్పుపట్టడం అర్థరహితం. బలమైన సాక్ష్యాలు ఉండబట్టే ఈ మేరకు తీర్పు వచ్చింది. ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన వైనం, కుట్రకు, ఇందుకు సహకరించిన వారిపై సంపూర్ణ ఆధారాలు సమర్పించారు.

– బద నారాయణరెడ్డి, న్యాయవాది, అనంతపురం

ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి



చంద్రబాబునాయుడు నేరపూరిత కుట్రకు పాల్పడ్డారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని న్యాయస్థానం తేల్చింది. ఈ కేసులో సీఐడీ పెట్టిన సెక్షన్ 409 వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో చంద్రబాబుకు 14 రోజుల రిమాండ్‌ను విధించారు న్యాయమూర్తి. కేసులో నేరతీవ్రత ఉందన్న వాదనలతో కోర్టు ఏకీభవిస్తోందని న్యాయమూర్తి తన తీర్పులో తెలిపారు.

– వై.జాఫర్ సిద్దిక్, న్యాయవాది, అనంతపురం

తప్పు చేసినోళ్లు శిక్ష అనుభవించాల్సిందే

- దోపిడీలో చంద్రబాబుకు చాలా స్కిల్ ఉంది
- పక్కా ఆధారాలతో అడ్డంగా దొరికినా బుకాయింపు
- శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

రాప్తాడురూరల్: 'ఎలాంటి తప్పు చేసినా తప్పించుకోవచ్చని కొందరు అనుకుంటుంటారు. అలాంటి వారికి ఒకరోజు వస్తుందనే విషయం ఈరోజు చంద్రబాబు విషయంలో రుజువైంది' అని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. ఆదివారం ఆమె అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుది స్వయం కృతాపరాధమన్నారు. వయసు చెబుతూ తప్పించుకోవాలని చూస్తున్నారని, ఏ వయసులైనైనా సరే తప్పుచేస్తే శిక్ష తప్పదన్నారు. 2018లోనే విచారణ జరగాల్సిన కేసును ఎందుకు అడ్డుపడుతూ వచ్చారని ప్రశ్నించారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో దీన్ని తొక్కి పెట్టారన్నారు. 2021లో కేసు నమోదైందని, దీని ఆధారంగా విచారణ సాగిందని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిధులు పక్కదారి పట్టించారన్నారు. ఏమీ లేకపోయినా అన్ని ఉన్నట్లు కనికట్టు చేసే స్కిల్ చంద్రబాబు వద్ద ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ. 371 కోట్లను రూల్స్‌కు విరుద్ధంగా కంపెనీకి ఇస్తున్నారంటూ అప్పట్లో అధికారులు అభ్యంతరం చెప్పినా సీఎం హోదాలో నేరుగా షెల్ కంపెనీకి ఇచ్చారన్నారు. దోపిడీలో చంద్రబాబుకు పెద్ద అనుభవం ఉందన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో ఆయన అనుభవాన్ని అంతా దోపిడీకి ఉపయోగించుకున్నారన్నారు. ప్రస్తుతం ఒకటి బయటపడిందని, వెలుగులోకి రాని స్కాంలు చాలా ఉన్నాయని అన్నారు. రెండు ఎకరాలు ఉన్న చంద్రబాబు ఈరోజు వేల కోట్ల రూపాయలకు ఎదిగాడన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన అన్ని కుంభకోణాలపైనా లోతుగా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. కుట్రపూరితంగా తనను ఇరికించారంటూ ప్రజల్లో సింపతి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. చాలా తెలివిగా చేశామని అనుకున్నా...చివరకు బొక్క బోర్లా పడ్డారన్నారు. సమావేశంలో బుక్కరాయసముద్రం ఎంపీపీ సునిత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సర్పంచ్ పార్వతి పాల్గొన్నారు.

విశ్వసనీయత కోల్పోయిన చంద్రబాబు



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి అర్బన్: వయోభారంతో పాటు ఆరోగ్యం సహకరించడం లేదని సానుభూతి ద్వారా రిమాండ్ నుంచి తప్పించుకోవడానికి మాజీ సీఎం చంద్రబాబు ప్రయత్నించి విశ్వసనీయత కోల్పోయారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. ఆదివారం తాడిపత్రిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుకు రిమాండ్ విధింపుతో ఎన్టీఆర్ ఆత్మ శాంతించిందన్నారు. అరెస్టు నేపథ్యంలో ఆరోగ్యం సహకరించలేదంటున్న చంద్రబాబు ఊరూరా తిరుగుతూ సభలు, సమావేశాలు నిర్వహించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అవినీతికి పాల్పడినట్లు పూర్తి ఆధారాలు లభ్యమవడంతోనే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీకి కానీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గానీ ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. 14 రోజులు రిమాండ్ విధించడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. చంద్రబాబు పాపం పండి న్యాయం గెలిచిందన్నారు. ఆయన ఒక అవినీతి అనకొండ అని అభివర్ణించారు. నంద్యాలలో అరెస్టు చేసి విజయవాడకు తరలించే క్రమంలో సీఐడీ అధికారులు హెలికాప్టర్‌ను సిద్ధం చేయగా.. సానుభూతి పొందేందుకోసం రోడ్డు మార్గం ఎంచుకున్నారని విమర్శించారు. అరెస్టుపై సొంత పార్టీ కార్యకర్తలే నోరువిప్పకపోవడం చూస్తే చంద్రబాబుపై కార్యకర్తల్లో ఎంతమేర విశ్వసనీయత ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. సమావేశంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నరేంద్రనాథ్‌రెడ్డి, కో కన్వీనర్ హనీ, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ మరింత సులభతరం

- కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్‌తోపాటే మ్యుటేషన్
- ఈ నెల 15 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నూతన కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం కావడంతోపాటు వినియోగదారులకు కచ్చితత్వంతో కూడిన లావాదేవీలతోపాటు అవినీతి అక్రమాలకు తావులేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండనుంది. 24 ఏళ్ల క్రితం రిజిస్ట్రేషన్ శాఖ కార్డ్ అనే సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టి స్థిరాస్తులను క్రయ, విక్రయదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తోంది. వినియోగదారులకు ఖర్చు భారాన్ని తగ్గించేందుకు నాలుగేళ్ల క్రితం పీడీఈ (పబ్లిక్ డేటా ఎంట్రీ) స్థిరాస్తి కొనుగోలుదారులే తమ డాక్యుమెంట్లను రూపొందించుకునే నూతన విధానాన్ని తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత చేరువ చేసింది. తాజాగా కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. వినియోగదారులు ఎంచుకున్న సమయంలోనే 20 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయనుంది. నూతన విధానం అమ్మకందార్లతోపాటు కొనుగోలుదారులకు సైతం ఎటువంటి తప్పులూ దొర్లకుండా రిజిస్ట్రేషన్ మరింత పారదర్శకం కానుంది.

ఆటోమేటిక్‌గా మ్యుటేషన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా వ్యవసాయ భూములు కొనుగోలు చేసుకొని వినియోగదారులు దగ్గరలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లబ్ధిదారు చేతికి వచ్చిన తర్వాత తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి అక్కడి రెవెన్యూ అధికారులను సంప్రదించి కొత్త పట్టాదారు పాసుపుస్తకాల కోసం మ్యుటేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత 40 రోజుల్లోపు భూమి కొనుగోలుదారుకు పాసుపుస్తకాలను మంజూరు చేస్తారు. ప్రస్తుత తరుణంలో రిజిస్ట్రేషన్ శాఖ ప్రవేశపెట్టిన నూతన సాఫ్ట్‌వేర్‌తో రెవెన్యూ అధికారులను సంప్రదించకుండానే కొనుగోలుదారు చిరునామాకు పది రోజుల్లోనే పట్టాదారు పాసుపుస్తకాలు ఇంటికే వచ్చేస్తాయి.

- మ్యుటేషన్‌కు వెళ్లిన డాక్యుమెంట్లు వెంటనే రెవెన్యూ అధికారుల లాగిన్‌కు వెళ్తాయి. వారు అక్కడ నిర్దీత సమయంలోగా ఆమోదించాల్సి ఉంటుంది. వారు ఆమోదించిన వెంటనే 10 రోజుల్లోపు 1బీ, అడంగల్‌లో కొత్తగా భూమి కొనుగోలు చేసిన వ్యక్తి పేరు రావడంతోపాటు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు సైతం నేరుగా ఇంటికే వచ్చేస్తాయి. ఈ విధానం ఈ నెల 15న ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అమల్లోకి రానుంది. వ్యవసాయేతర భూములు, వ్యవసాయ భూములు కొనుగోలు చేసే వినియోగదారులకు కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ మంచి ప్రయోజనకరంగా మారనుంది.

మరో నాలుగు ఎంఎస్‌ఎంఈ పార్కులు

అనంతపురం టౌన్: జిల్లాకు మరో నాలుగు చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇదివరకే రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలో 100 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. తాజాగా కూడేరు మండల కేంద్రం, గార్లదిన్నె మండలం కనుంపల్లి, రాయదుర్గం మండలం వేపరాళ్ల, కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామాల్లో నాలుగు ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే కూడేరు, వేపరాళ్ల, తిమ్మసముద్రం గ్రామాల్లో స్థలాల సేకరణ పూర్తి చేసింది. కనుంపల్లిలో స్థల సేకరణలో అధికారులు నిమగ్నమైనారు. ఏపీఐఐసీ అధికారులు దాదాపు 1,500ఎకరాల్లో ఈ నాలుగు పార్కులను అభివృద్ధి చేయనున్నారు. పారిశ్రామిక వేత్తలు దరఖాస్తు చేసుకుంటే పరిశ్రమల స్థాపనకు అవసరమైన స్థలాన్ని ఏపీఐఐసీ అధికారులు మంజూరు చేయనున్నారు.

అనుమతులు రాగానే పనులు

జిల్లాకు నాలుగు చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) పార్కులు మంజూరయ్యాయి. వాటిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదికను పంపించాము. అక్కడి నుంచి అనుమతులు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం.

– సోనీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

కమనీయం.. ఆంజనేయస్వామి రథోత్సవం

బొమ్మనహాళ్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నేమకల్లు ఆంజనేయస్వామి రథోత్సవం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువుదీర్చి, ఇదే రథంపై నలుగురు పూజారులు కూర్చుని ఉండగా భక్తులు లాగారు. శ్రావణంలో మూడు (కసాపురం, మురడి, నేమకల్లు) ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్న భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరయ్యారు. సాయంత్రం ఐదు గంటలకు ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగి, మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఏడు గంటలకు లంకా దహనం కార్యక్రమం జరిగింది. స్థానిక ఎస్‌ఐ శివ, డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు వైద్యం అనిల్‌కుమార్ స్వామి, సర్పంచ్ పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



అశేష భక్తజనసందోహం నడుమ సాగుతున్న ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం

క్లుప్తంగా

టీచర్లను బోధనకే వినియోగించాలి



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

రాప్తాడురూరల్: ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ప్రాంతీయ వర్క్ షాపు జరిగింది. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నక్కా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పనిదినాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో బోధనా సమయం వృథా అవుతోందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయకుండా విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఉపాధ్యాయులపై బనాయించిన కేసులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ ఎంవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ దేవేంద్రమ్మ, ఎస్. శాంతి ప్రియ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, శ్రీసత్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, ఎం. సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొమ్మనహాళ్/బెళుగుప్ప: అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపిన మేరకు.. మండలంలోని శ్రీరంగాపురం సమీపంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనం వచ్చింది. పోలీసు సిబ్బంది తనిఖీ చేసి అందులో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. కణేకల్లు మండల పరిధిలోని కోకుర్తి నుంచి పావగడకు తరలిస్తున్నట్లు తెలిసింది. బొలెరో వాహనంతో పాటు మహేంద్ర, మహేష్, మధు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

108లో ప్రసవం

హిందూపురం టౌన్: పరిగి మండలం బసనపల్లికి చెందిన ప్రేమ అనే గర్భిణి 108 వాహనంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం ఉన్నఫళంగా ఆమెకు నొప్పులు రావడంతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ప్లేట్‌లేట్స్ తక్కువగా ఉండడంతో మెరుగైన వైద్యానికి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో 108లో ఆమెను తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పెనుకొండ సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. వాహనాన్ని పక్కకు ఆపి 108 పైలట్ ఫరీద్ సాయంతో ఈఎంటీ సురేష్ ఆమెకు సాధారణ కాన్పు చేశారు. మగబిడ్డకు ప్రేమ జన్మనిచ్చారు. తల్లీబిడ్డను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని తెలపడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కాన్పు చేసిన 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శుభవార్తకు రైట్‌రైట్

- సీఎం జగన్ 'కారుణ్యం'
- ఆర్టీసీ ఉద్యోగులకు ఆది నుంచి అండ
- గతంలో బాబు తిరస్కరించిన కారుణ్య నియామకాలకు మోక్షం
- తొలివిడతలో 60 మందికి పోస్టింగ్
- తాజాగా మరో 81 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు కసరత్తు
- కలెక్టర్‌కు ఫైల్ పంపిన ఆర్టీసీ అధికారులు



అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ఆర్టీసీకి అనేక సంవత్సరాల పాటు సేవలందించిన పలువురు ఆర్టీసీ కార్మికులు చనిపోతే గతంలో చంద్రబాబు ప్రభుత్వం కనీస కారుణ్యం చూపలేదు. ఆయా ఉద్యోగుల కుటుంబాల సంక్షేమాన్ని పక్కన పెట్టేసింది. కారుణ్య నియామకాలు కల్పించాలని కోరితే మొండిచేయి చూపింది. అయితే, సీఎంగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్.. మొదటి సారి కారుణ్య నియామకాలకు శ్రీకారం చుట్టి బాధలో కూరుకుపోయిన ఆర్టీసీ కుటుంబాలకు శుభవార్త చెప్పారు. తాజాగా మరోసారి ఇంకొందరికి ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు.

అన్ని విధాలా మేలు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు అన్ని విధాలా మేలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వంలోకి ఉద్యోగులకు విలీనం చేసి వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపింది. అత్యధిక మొత్తం పింఛన్ తీసుకునేలా చర్యలు చేపట్టి సంతోషం పంచింది. ఆ క్రమంలోనే చంద్రబాబు ప్రభుత్వం ఏళ్ల పాటు పట్టించుకోని కారుణ్య నియామకాల ఫైల్‌కు మోక్షం కల్పించింది. 2016 జనవరి 1 నుంచి 2019 డిసెంబర్ 31 వరకూ 79 మంది మృతి చెందిన వారి కుటుంబాల్లోని 9 మందిని సచివాలయాల్లో, 51 మందిని ఆర్టీసీలో ఉద్యోగులుగా నియమించింది.

మరోసారి కారుణ్యం..

ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం మరికొందరికి కారుణ్య నియామకాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇటీవల సర్కారు నుంచి అనుమతులు రావడంతో అధికారులు ఫైల్ సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 2020 జనవరి 1 తర్వాత 81 మంది మృతి చెందారు. ఆయా కుటుంబాలకు సంబంధించి 16 మందిని సచివాలయ ఉద్యోగులుగా, మిగిలిన వారిని ఆర్టీసీలో నియమించనున్నారు. 14 కండక్టర్, 4 శ్రామిక్, 32 డ్రైవర్ పోస్టులు ఖాళీ ఉన్నట్లు గుర్తించారు. త్వరలో నియామకాలు చేపట్టనున్నారు.

మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకూ తీపికబురు!

సర్కారు చర్యలతో ఆర్టీసీలో పనిచేస్తూ అనారోగ్యం బారిన పడి మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి. 19/2015 సర్క్యులర్ ప్రకారం మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల కుటుంబసభ్యులకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. 8 సంవత్సరాలుగా ఈ నియామకాలు జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 మంది ఉండగా, జిల్లాలో 18 మంది ఎదురుచూస్తున్నారు. త్వరలో వీరికి కూడా తీపికబురు అందనున్నట్లు ఆర్టీసీ అధికార వర్గాల ద్వారా తెలిసింది.

కలెక్టర్‌కు ఫైల్ పంపాం

కారుణ్య నియామకాలను చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గతంలో 60 మందికి పోస్టింగ్ ఇచ్చాం. మరోసారి అకాల మరణం పొందిన ఉద్యోగుల వివరాలను తెప్పించాం. దాదాపు 81 మంది వరకూ ఉన్నట్లు తేలింది. ఆర్టీసీలో ఖాళీలను కూడా గుర్తించాం. ఫైల్‌ను కలెక్టర్‌కు పంపాం. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నియామకాలు చేపడతాం. అర్హులైన వారిని ఆయా విభాగాల్లో నియమిస్తాం.

– సుమంత్ ఆర్ ఆదోని, జిల్లా ప్రజా రవాణా అధికారి

జెడ్పీలోనూ కారుణ్యం!

అనంతపురం సిటీ: కరోనా మహమ్మారి బారిన పడి అకాల మృత్యువాతపడ్డ ఉద్యోగుల వారసులపై ప్రభుత్వం కారుణ్యం చూపింది. వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ గౌతమికి ఆదేశాలందాయి. ఇప్పటికే ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు పంచాయతీరాజ్ శాఖ, జెడ్పీ పాఠశాలల్లో పని చేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు చాలా మంది కరోనా కారణంగా ప్రాణాలు విడిచారు. బాధితుల జాబితాను జెడ్పీ అధికారులు రూపొందించారు.

అంగీకార పత్రాల స్వీకరణ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 32 మంది కరోనాబారిన పడి మరణించినట్లు తేల్చారు. వారి వారసులకు విద్యార్హతలను బట్టి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశాల మేరకు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, డిప్యూటీ సీఈఓ లలితాబాయి ఆధ్వర్యంలో జెడ్పీ 'ఏ' సెక్షన్ ఉద్యోగులు మూడు రోజులుగా కసరత్తు చేస్తున్నారు. చనిపోయిన ఉద్యోగుల వారసులను శనివారం జెడ్పీ కార్యాలయానికి పిలిపించారు. పరిస్థితి వివరించి, అంగీకార పత్రాలు తీసుకున్నారు. జెడ్పీ చైర్ పర్సన్ అనుమతి తీసుకున్నాక కలెక్టర్ గౌతమికి సమగ్ర నివేదిక పంపనున్నారు. అయితే చాలా మంది జెడ్పీలో పోస్టులు కావాలంటూ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిసింది.

అశ్రునయనాలతో జవాను అంత్యక్రియలు



నారాయణస్వామిపై కప్పిన జాతీయ జెండాను భార్య శ్రీవాణికి అప్పగిస్తున్న బీఎస్ఎఫ్ అధికారులు

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లడ్యాంలో ఆదివారం బీఎస్ఎఫ్ జవాను నారాయణ స్వామి అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ ముగిశాయి. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమ యాత్రలో గ్రామస్తులు, స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఘన నివాళులర్పించారు. భౌతికకాయం వద్ద బీఎస్ఎఫ్ సిబ్బంది గాల్లోకి 3 రౌండ్ల కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు. నారాయణ స్వామిపై కప్పిన జాతీయ జెండాను ఆయన భార్య శ్రీవాణికి అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా భార్య రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

పాముకాటుతో మహిళ మృతి



మృతి చెందిన గంగమ్మ

కుందుర్పి: పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని రుద్రంపల్లిలో జరిగింది. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన కురుబ ఈశ్వరప్ప, గంగమ్మ (32) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. గంగమ్మ ఆదివారం ఉదయం తన పొలంలో టమాటాలు తొలగిస్తుండగా పాముకాటు వేసింది. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించక గంగమ్మ మృతి చెందింది.

గుండెపోటుతో రైల్వే టీటీఈ మృతి



మృతుడు వాసు(ఫైల్)

గుత్తి: గుండెపోటుతో రైల్వే టీటీఈ మృతి చెందిన ఘటన గుత్తి ఆర్ఎస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన వాసు (50) గుంతకల్లు రైల్వేలో టీటీఈ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్)గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఆయన ఇంట్లో కుప్పకూలి పడిపోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు మొదట గుత్తి రైల్వే ఆసుపత్రికి తర్వాత గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి, అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి వాసు చికిత్స ఫలించక మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, మున్సిపల్ కౌన్సిలర్లు వరదరాజులు, అరవింద్ బాబు, పలువురు నాయకులు ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

జై మాతా బీబీ జైనబ్బీ!

- 13 నుంచి ఉరవకొండలో అమ్మవారి ఉరుసు
- హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీక
- రాష్ట్రంలోనే ఏకైక అమ్మవారి దర్గా



అమ్మవారి సమాధి

ఉరవకొండ: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కీర్తి గడించిన ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 13న ప్రారంభం కానున్నాయి. హిందూ–ముస్లింల సమైక్యతకు ప్రతీకగా అమ్మవారు పూజలందుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉరవకొండలో మాత్రమే అమ్మవారికి ప్రత్యేకంగా దర్గా ఉండడం గమనార్హం. అపురూప శిల్పకళలు అందులో కనువిందు చేస్తాయి.

మాతా బీబీ జైనబ్బీ జీవసమాధి కథనమిలా..

బీబీ జైనబ్బీ చరిత్రకి సంబంధించి పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అమ్మవారు కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ వాస్తవ్యులు. ఆమె అపురూప సౌందర్యరాశి. ఉరవకొండ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో అక్కడ క్యాంపు వేసిన బ్రిటిష్ సైనికులు దురుద్దేశంతో వెంటపడతారు. దీంతో భూమాతను కాపాడాలని ఆమె వేడుకోగా అక్కడ భూమి రెండుగా చీలింది. దీన్ని గమనించిన ఓ బ్రిటిష్ సైనికుడు భూమిలోకి వెళుతున్న అమ్మవారి జడకుచ్చులను పట్టుకుని లాగడానికి ప్రయత్నించి రక్తం కక్కుకుని మృతి చెందాడు. అక్కడే ఉన్న మిగిలిన సైనికులు కంటి చూపు కోల్పోయారని కథనం. చేసిన తప్పు తెలుసుకున్న బ్రిటిష్ సైనికులు అమ్మవారిని క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకోగా, ఆమె కరుణించి చూపు ప్రసాదించిందని భక్తులు చెబుతారు. అమ్మవారు జీవసమాధి అయిన చోటే బ్రిటిష్ సైనికులు సమాధి ఏర్పాటు చేసి ప్రార్థనలు చేసినట్లు ప్రతీతి.

ఎన్నో ప్రత్యేకతలు..

బీబీ జైనబ్బీ అమ్మవారి దర్గా ప్రత్యేకతలకు నెలవుగా పేరుగాంచింది. అపూరూప శిల్పకళతో విరాజిల్లుతోంది. అరబ్ దేశంలోని మక్కా ప్రాంతంలో ఏర్పాటు చేసిన జన్నత్ కాదర్వాజ (స్వర్గద్వారం)ను పోలిన కట్టడాన్ని కర్ణాటక ప్రాంతానికి చెందిన కళాకారులతో ఇక్కడ ఏర్పాటు చేయించారు. దీంతో పాటు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని ఖాజబందే నవాజ్ దర్గా తరహాలో ఉన్న గాజు గోపురాన్ని రూపొందించారు. అజ్మీర్‌లోని ఖాజగరీబ్ నవాజ్ దర్గాలోని దేగ్‌ను అదే తరహాలోనే రూ. 4 లక్షలు వెచ్చించి జైనబ్బీ దర్గాలో ఏర్పాటు చేశారు. దర్గా శిఖర కలశం కూడా ఆకట్టుకుంటోంది.

15 వరకూ వేడుకలు..

జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభమవుతాయని దర్గా కమిటీ అధ్యక్షులు హోతురూ బాషా, సభ్యులు తెలిపారు. మొదటి రోజు గంధం వేడుకలు, 14న ఉరుసు, 15న జియారత్ వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రసిద్ధి గాంచిన ఖవ్వాలీ దారులతో ఖవ్వాలీ పోటీలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారని వివరించారు.

కూలీబిడ్డల 'ఉన్నతి'కి బాటలు

ఉపాధి హామీపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాల్లోని పిల్లలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సువర్ణావకాశం కల్పిస్తున్నాయి. ఉచితంగా పలు అంశాలపై శిక్షణ ఇవ్వడమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రీకారం చుట్టాయి. శిక్షణలో రోజుకూలితో పాటు ఉచితంగా భోజనం, దుస్తులు, వైద్య సదుపాయం కల్పిస్తారు.

- ఉపాధి కూలీల పిల్లలకు సువర్ణావకాశం
- వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగులకు శిక్షణ
- అనంతపురం టీటీడీసీలో ప్రారంభం
- రోజుకూలితో పాటు ఉచితంగా భోజనం, దుస్తులు

అనంతపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు పనులు కల్పిస్తూ ఆదుకుంటున్న ప్రభుత్వాలు ఆయా కూలీల బిడ్డల బంగారు భవిష్యత్తుకు కూడా బాటలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. వందరోజుల పని పూర్తి చేసిన ఆయా కుటుంబాల్లోని నిరుద్యోగులకు సాంకేతిక కోర్సుల్లో శిక్షణ కల్పించేందుకు 'ఉన్నతి' పథకం అమలు చేస్తున్నాయి. జిల్లాలో నిరుద్యోగులకు పంగల్ రోడ్డులోని టీటీడీసీలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

ఉపాధి అవకాశాలు కూడా..

అర్హులైన నిరుద్యోగులకు ఆటోమేటివ్ ప్రాడక్ట్ డిజైన్ లీడ్ ఇంజినీర్, క్యాడ్ టెక్నిషియన్, సేల్స్ సూపర్‌వైజర్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్ అసెంబ్లీ ఆపరేటర్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, డేటా ఎంట్రీ టెక్నికల్ కోర్సులతో పాటు సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లలో శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులు. పదో తరగతి, ఆపై చదివి ఉండాలి.

ఇప్పటికే 90 మందికి శిక్షణ..

'ఉన్నతి' పథకం కోసం ప్రభుత్వం అర్హులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వంద రోజులు పని పూర్తి చేసిన వారి జాబితాలు తీసుకుని ఆ కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగులను గుర్తిస్తున్నారు. ఇప్పటికే 90 మందికి మూడు బ్యాచ్‌లు చొప్పున శిక్షణ కల్పిస్తున్నారు. కోర్సును బట్టి మూడు నుంచి ఆరు నెలల శిక్షణ ఉంటుంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పంగల్ రోడ్డు వద్ద ఉన్న టీటీడీసీలో శిక్షణ ఉంటుంది. ఎంపిక చేసిన వారికి శిక్షణ కాలంలో రోజుకు రూ.272 భృతి ఇస్తారు. హాస్టల్ వసతితో పాటు భోజన సదుపాయం కల్పిస్తారు. దుస్తులు, పుస్తకాలతో పాటు ఉచిత వైద్యం అందిస్తారు. శిక్షణ పూర్తికాగానే ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చూపిస్తారు.

నాణ్యమైన శిక్షణ

ఉపాధి హామీ కూలీల బిడ్డలకు ఉద్యోగావకాశాలు కల్పించేలా శిక్షణ నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులను గుర్తించి అర్హతను బట్టి సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇస్తాం. అర్హులను గుర్తించే ప్రక్రియను చేపడుతున్నాం. ప్రభుత్వం 300 మందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించింది. ఇప్పటికే 90 మందికి శిక్షణ కల్పిస్తున్నాం.

– ఐ. నరసింహా రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీవీ రమణయ్య పేర్కొన్నారు. చదువుల్లో ప్రతిభ కనబరుస్తున్న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం స్థానిక జయమణెమ్మ కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. నాయీబ్రాహ్మణ విద్యార్థులు ఎవరికీ తీసిపోరని, నైపుణ్యం, సమర్థత, కమ్యూనికేషన్ స్కిల్స్ మన రక్తంలోనే ఉన్నాయన్నారు. ఉన్నత విద్య అభ్యసించి కుల గౌరవం, ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపు నిచ్చారు. నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరం 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 42 మందికి, ఇంటర్‌లో సత్తా చాటిన 8 మంది విద్యార్థులకు రూ.1,000 చొప్పున నగదు ప్రోత్సాహం, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. తమ సంఘానికి కర్నూలుకు చెందిన సీఐ ఉపేంద్రబాబు రూ.2 లక్షల చెక్‌ను అందజేయడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు సుబ్రమణ్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాష్ట్ర కోశాధికారి బాలతాత, గుంటూరు జిల్లా అధ్యక్షుడు దేవ ప్రసాదరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివేకానందస్వామి, పీటీసీ సీఐ కృష్ణమోహన్, శింగనమల మండల విద్యాధికారి నరసింహరాజు, శ్రీనిధి ఏజీఎం హనుమేష్‌బాబు, డీఆర్ఓ కొండయ్య, 50వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ బాబు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, శివప్రసాద్, ఆర్టీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'సాఫ్ట్'గా ప్రవేశించి.. రికార్డులు లిఖించి

- సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాధిక ఖండాంతర ఖ్యాతి
- తాజాగా 'లాక్రోస్' ఆటలోనూ సత్తా
- త్వరలో అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం
- రాష్ట్రానికి చెందిన తొలి క్రీడాకారిణిగా ఘనత



రాధిక (ఫైల్)

అనంతపురం: సాఫ్ట్‌బాల్ క్రీడలో నాలుగు సార్లు ఆమె అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించినా.. ఆటపై మక్కువ పెంచుకుని మెరికలా మారి నాలుగు సార్లు పతకాలు సాధించింది. వివాహమైనా క్రీడలకు దూరం కాక అచంచెల ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్లింది. ఆ క్రమంలోనే 'లాక్రోస్' ఆట వైపు దృష్టి సారించింది. అక్కడా సత్తా చాటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్న జట్టుకు ఎంపికైంది. పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన జే. రాధిక ఎస్కేయూ పరిధిలో డిగ్రీ పూర్తి చేసింది. సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తూ.. అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి జట్లకూ ఎంపికైంది. చైనా, అమెరికా దేశాల్లో దేశం తరపున పాల్గొని రాణించింది. గ్రామీణ ప్రాంతంలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఒక్కో మెట్టు ఎక్కింది. ఈ క్రమంలోనే లాక్రోస్ పోటీలపై మక్కువ పెంచుకున్న ఆమె.. ఆ ఆటలోనూ రాణిస్తూ.. అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం ఢిల్లీలో శిక్షణ తీసుకుంటోంది. త్వరలో కెనడాలో జరగనున్న పోటీలకు బయలుదేరనుంది.

చిన్న పాప ఉన్నా..

పాఠశాల స్థాయిలో కబడ్డీ, ఖోఖో ఆడుతున్న రాధిక.. పీఈటీల ప్రేరణతో పదేళ్ల క్రితం సాఫ్ట్ బాల్ పోటీల్లో ఎంట్రీ ఇచ్చింది. ఆర్డీటీ ప్రోత్సాహంతో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జాతీయ స్థాయి జట్లలో ప్రాతినిధ్యం వహించింది. ఆమె ప్రతిభను మెచ్చిన సెలెక్టర్లు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. చైనాలో రెండు పర్యాయాలు, సింగపూర్, అమెరికాలో ఒక్కసారి చొప్పున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంది. డిగ్రీ పూర్తికాగానే తల్లిదండ్రులు పెళ్లి చేశారు. ఆమె ఓ పాపకు జన్మనిచ్చింది. వివాహం తర్వాత సాధారణంగా మహిళలు క్రీడలకు స్వస్తి పలుకుతారు. అయితే, రాధిక మాత్రం ఇందుకు భిన్నంగా కుస్తీ పోటీల్లో ప్రవేశించింది. ఇందులోనూ బంగారు పతకం సాధించింది.

సత్తా చాటుతా..

అక్టోబర్ 6,7,8 తేదీల్లో లాక్రోస్ టోర్నమెంట్ కెనడాలోని ఓషావాలో ఉంటుంది. ఓ సాధారణ కుటుంబం నేపథ్యం నాది. పోటీల్లో పాల్గొనాలంటే రూ.3 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. స్పాన్సర్లు ఆదుకుంటే కెనడా వెళ్లి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తా. నాకు అవకాశం కల్పించిన రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా చాటుతాననే నమ్మకం ఉంది.

–జే. రాధిక

రాధిక సాధించిన విజయాలు..

- 2012 సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించి రజత పతకం కైవసం చేసుకుంది.
- చైనాలో 2016,2018లో జరిగిన ఆసియా జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్, ఆసియా విశ్వవిద్యాలయాల సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొని ఐదో ర్యాంకు పొందింది.
- 2017లో అమెరికాలో జరిగిన జూనియర్ ప్రపంచ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాధిక పాల్గొంది.
- 2013 నుంచి 2019 నుంచి వరుసగా 14 సార్లు జూనియర్, సీనియర్ విభాగాల్లో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటింది.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



అశోక్‌కుమార్ (ఫైల్)

మడకశిరరూరల్: భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గోవిందాపురంలో చోటుచేసుకుంది. ఎస్ఐ లోకేష్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ (29), రొద్దం మండలం తురకలపట్నం గ్రామంలో ఐదు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. భార్య కాపురానికి రమ్మంటే తిరస్కరించింది. దీంతో మనస్తాపం చెంది చెట్టుకు ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి సిద్ధగంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ గేయానంద్



అనంతపురం కల్చరల్: జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ గేయానంద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రెండు రోజులుగా చీరాలలో జరుగుతున్న జేవీవీ 17వ రాష్ట్ర మహాసభల్లో జేవీవీ జాతీయ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జేవీవీ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న కోయా వెంకటేష్ గేయానంద్ ఎంపికను ప్రకటించారు. ఈ సందర్భంగా గేయానంద్ 'సాక్షి'తో మాట్లాడుతూ రెండేళ్ల పాటు అధ్యక్ష పదవి ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథం పెంచేలా కార్యక్రమాలను చేపడతామన్నారు. విద్యావిధానంలో శాస్త్రీయత పాటించేలా విధి విధానాలు రూపొందించి ప్రభుత్వాలకు తెలియజేస్తామన్నారు. గేయానంద్‌ను, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎంపికైన భాస్కర్‌ను రచయితలు, జేవీవీ సభ్యులు అభినందించారు.

క్లుప్తంగా

మయూరి రెస్టారెంట్ ప్రారంభం


మయూరి రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం: నగరంలోని గుత్తి రోడ్డులో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా మయూరి రెస్టారెంట్‌ను ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మయూరి రెస్టారెంట్‌కు మంచి పేరుందని, రెండో బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషదాయకమని అన్నారు. మయూరి రెస్టారెంట్ పేరుతో రెస్టారెంట్, టిఫిన్ సెంటర్, బేకరి సెంటర్ ఏర్పాటు చేశామని రెస్టారెంట్ అధినేత నారాయణ రెడ్డి అన్నారు. రుచికరమైన, నాణ్యమైన వంటలు కస్టమర్లకు అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కార్పొరేటర్ కృష్ణమూర్తి, మయూరి హోటల్ భాగస్వాములు షఫీఉల్లా, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పఠనం


చాలీసా పఠనం చేస్తున్న అయ్యప్ప దీక్షా సమితి సభ్యులు

అనంతపురం కల్చరల్: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఒకేసారి ఆదివారం రాత్రి సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేశారు. నగరంలోని హరిహర ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో మార్మోగించారు. ప్రత్యేక పూజలు, మహామంగళ హారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అంబటి ఫణిరాజ్, ఆకుల రాఘవేంద్ర, రంగాచారి పాల్గొన్నారు.

'సన్నజీవం' చిత్రం ప్రీమియర్ షో


ప్రీమియర్ షోలో మాట్లాడుతున్న దర్శకుడు కల్లూరు అశోక్

అనంతపురం కల్చరల్: ఓ నిరుపేద సొంతింటి కలను ఎలా నెరవేర్చుకున్నాడన్న నేపథ్యంలో తీసిన సన్నజీవం సినిమా అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం ఉదయం త్రివేణి థియేటర్‌లో చిత్రం ప్రీమియర్ షో వేశారు. జిల్లాకు చెందిన దర్శకుడు, మాటల రచయిత కల్లూరి అశోక్ మాట్లాడుతూ అనంతలో ఎంతో మంది యువతీ యువకులు అన్ని రకాల నైపుణ్యం కలిగి ఉన్నారన్నారు. అవకాశాలు రావాలే కానీ అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. త్వరలో రాష్ట్రం అంతటా సినిమాను రిలీజ్ చేస్తామన్నారు. అనంతకు చెందిన నటీనటులు, సాంకేతిక బృందంతో సినిమా నిర్మించామని, ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని కోరారు. హీరో గురు చరణ్ మాట్లాడుతూ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానం ఉందని, ఇక్కడివారు పిలిస్తే తప్పకుండా నటిస్తానన్నారు. సన్నజీవం సినిమాకు పనిచేసిన దర్శకుడికి గతంలో ఉత్తమ సంభాషణ రచయితగా అవార్డు వచ్చిందని, ఈ సినిమాకు కూడా అవార్డులు వస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నటీనటులు గోపాల్, అర్జున్, శివ, సమర్పకులు శ్రీదేవి కల్యాణ్ తదితరులు మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


వెంకటేష్ నాయక్‌ను హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్‌నాయక్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..ఆత్మకూరు మండలం వేపచెర్ల తండాకు చెందిన వెంకటేష్‌నాయక్, సునీతమ్మ ద్విచక్రవాహనంపై అనంతపురం నుంచి వేపచెర్ల తండాకు వెళ్తుండగా వడ్డుపల్లి వద్ద ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో వెంకటేష్ నాయక్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ వాహనంలో అతన్ని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గం – అనంతపురం హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 1033 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని, హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

గండం దాటితేనే గమ్యం

- బైపాస్ ఎక్కాలంటేనే భయం భయం
- అతివేగంతోనే తరచూ రోడ్డు ప్రమాదాలు
- ప్రమాద హెచ్చరిక బోర్డులున్నా ఫలితం శూన్యం



వడ్డుపల్లి వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డు వద్ద పోలీసులు(ఫైల్)



పంపనూరు వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద సూచిక బోర్డు

ఆత్మకూరు:

- ఆత్మకూరు మండల పరిధిలోని వడ్డుపల్లి వద్ద ఈ నెల 8న ఆత్మకూరుకు చెందిన సురేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, బొలెరో (టమాటా లోడు) ఢీకొని ఇద్దరు మరణించారు.
- ఆత్మకూరు బైపాస్ వద్ద జూలై 28న కర్నూల్‌కు చెందిన రాఘవేంద్ర, అనిల్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, రోడ్డు దాటే క్రమంలో ఐచర్ వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరూ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు.
- వడ్డుపల్లి వద్ద మార్చి 30న ఆత్మకూరుకు చెందిన రామచంద్ర ,ముత్యాలక్క దంపతులు ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీ కొని, వారు అక్కడికక్కడే మృతిచెందారు.
- ఆత్మకూరు సమీపంలో ఏప్రిల్ 8న కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన సతీష్, నందు అనే ఇద్దరు వ్యక్తులు ఆటోలో వెళ్తుండగా బొలెరో వాహనం ఢీ కొని, ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.
- ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఆత్మకూరుకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొని ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.

ఇలా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ద్విచక్రవాహనాలపై బైపాస్ మీదుగా వెళ్లాలంటేనే వాహనదారుల వెన్నులో వణుకుపుడుతోంది. వారానికో రోడ్డు ప్రమాదం.. నెలకో మరణం అన్న రీతిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతేడాది జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. వాహన దారుల అతివేగమే ఈ ప్రమాదాలకు ముఖ్యకారణమని బాధితులు చెప్పిన మాటలు , సంఘటనల ఆధారంగా తెలుస్తోంది. ఆత్మకూరు నుంచి అనంతపురం వరకు కేవలం ఏడాది కాలంలోనే దాదాపు 20కు పైగా ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో బాధిత కుటుంబ సభ్యుల జీవితాలు రోడ్డున పడిన పరిస్థితి.

జాగ్రత్తలు తెలియజేస్తున్నా..

వాహనాలు నడిపే సమయంలో రోడ్డు నిబంధనలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నా, ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అనంతపురం నుంచి ఆత్మకూరు వరకు తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రదేశాలను పోలీసులు గుర్తించి, అలాంటి ప్రాంతాల్లో ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా ప్రమాదకర ప్రాంతాల్లో పోలీసులు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. డ్రమ్ములు ఏర్పాటు చేసి, నెమ్మదిగా వెళ్లాలని సూచిస్తున్నారు. అయినా ప్రమాదాలు ఆగడం లేదు. పంపనూరు అటవీ ప్రాంతం వద్ద , వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద ,వై. కొత్తపల్లి వద్ద, పంపనూరు మలుపు వద్ద, ఆత్మకూరు హైవే బైపాస్‌పై పోలీసులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు.

నిబంధనలు అతిక్రమించడం వల్లే..

ప్రస్తుతం టమాటాల సీజన్ కావడంతో వాహనదారులు లోడ్ సమయానికి మార్కెట్‌కు వెళ్లాలని వాహనాలను వేగంగా నడుపుతున్నారు. పరిమితికి మించిన లోడ్‌తో మితిమీరిన వేగంగా వెళ్తుండడంతోనే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చాలా మంది డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు ఉండవు. 18 ఏళ్లలోపు యువకులు ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారు. హెల్మెట్ ధరించకపోవడం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి ప్రమాద స్థలాల్లో హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచనలు ఏర్పాటు చేశాం. తరచూ వాహనాల తనిఖీ చేస్తున్నాం. లైసెన్స్‌లు లేని వారికి, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధిస్తున్నాం. అయినా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం సేవించి వాహనాలు నడిపినా, పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించినా చర్యలు తీసుకుంటున్నాం.

– జనార్దన్, ఆత్మకూరు ఎస్‌ఐ

గురుమూర్తికి 'స్వర్ణ నంది'


పురస్కారమందుకుంటున్న గురుమూర్తి

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు చిత్రాల గురుమూర్తి సిద్ధాంతి స్వర్ణనంది జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నారు. ఆదివారం విజయవాడలో విశ్వకర్మ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వారికి నంది స్వర్ణ పురస్కారాలు అందించారు. అందులో భాగంగా గురుమూర్తి విశ్వకర్మట్రస్టు కమిటీ సభ్యుడు డాక్టర్ మాచవరం గౌరీ శంకరాచార్యులు, డాక్టర్ ఎస్.బాల బ్రహ్మచారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

డీసీఈబీ కార్యదర్శికి సన్మానం


డీసీఈబీ కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ఇటీవల డీసీఈబీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కె .పురుషోత్తంబాబును సన్మానించారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఎస్సీ,ఎస్టీ హెచ్‌ఎం, ఎంఈఓల సంఘం ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం హెడ్మాస్టర్లు, మండల విద్యాశాఖ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తారా చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు కుల్లాయప్ప, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, నాయకులు రామచంద్ర, ఓబుళపతి, శ్రీనివాస ప్రసాద్, విజయభారతి, శాంతాబాయి, సాయి ప్రసాద్, ధనుంజయ, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ అందుకు సంబంధించిన లబ్ధి పత్రాలను ఎమ్మెల్యే అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇదే విషయాన్ని చెబుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే పచ్చ కండువా కప్పుకోవాల్సివచ్చేదన్నారు. జన్మభూమి కమిటీ సభ్యులు ఒప్పుకుంటేనే పథకాలు వచ్చేవని, మండల స్థాయి అధికారులు చెప్పినా ఉపయోగం ఉండేది కాదన్నారు. అర్హత ఉండికూడా పథకాలకు దూరమైన వారు ప్రతి గ్రామంలోనూ ఉండేవారు అని తెలిపారు. ఇప్పుడా పరిస్థితి లేదని ప్రజలే చెబుతున్నారన్నారు. వలంటీర్లకు వివరాలు అందజేస్తే వారే పథకాలు వచ్చేలా చూస్తున్నారని తెలిపారు. మండ్ల సుబ్బారెడ్డి కాలనీలో నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి, నందమూరినగర్‌లో గ్రామ సంఘం భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. సుంకలమ్మ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష, మసీదు నిర్మాణానికి రూ. లక్ష విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, సర్పంచ్ తేజశ్విని, నాయకులు ధనుంజయయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, యూత్ విభాగం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ కొడిమి పవన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ మఠం శ్యాంసుందర్, ఎంపీటీసీ సభ్యుడు సందీప్‌యాదవ్, వార్డు సభ్యులు గఫూర్, ముస్తాక్, శ్రీదేవి, బాలు, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గపడకూ...

ఆత్మకూరు: మండల కేంద్రంలో గడప గపడకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న, మండల యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులు, గ్రామ వలంటీర్లు , ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

'ఆత్మహత్య.. సమస్యకు పరిష్కారం కాదు'


విద్యార్థినులతో ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు

రాప్తాడురూరల్: సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కారాదని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇండియన్ సైక్రియాట్రిక్ సొసైటీ అనంతపురం బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో ఐఎంఏ హాలులో కార్యక్రమం నిర్వహించారు.సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలోని సుమారు 30 కళాశాలల్లో 3వేల మందికి పైగా యువతకు వారం రోజులుగా ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించామన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆచార్య కేఎల్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ హేమలత, అనంత జిల్లా ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ మనోరంజన్ రెడ్డి, ఐఎంఏ మహిళా కార్యదర్శి డాక్టర్ సుమన గోపీచంద్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడిని జయించాలి

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

రాప్తాడురూరల్: మానసిక ఒత్తిడిని జయిస్తే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉండదని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ డాక్టర్స్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ప్రభుత్వ కళాశాల ఎస్సీ బాలికల వసతి గృహంలో జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీదేవి, ఆంధ్రప్రదేశ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ రామలక్ష్మి మాట్లాడారు. ఏదో సాధించాలనే తపన, ఏమీ సాధించ లేదన్న నిరాశ, ఇంకేమీ సాధించలేమన్న నిస్సాహాయ స్థితిలోనే చాలామంది నిండు జీవితాలను బలితీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.హేమలత, జన విజ్ఞాన వేదిక సభ్యురాలు డాక్టర్ ప్రసన్న, అనంతపూర్ ఐఎంఏ ఉమెన్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ సుమన గోపీచంద్, సైకాలజిస్ట్ ఆర్యన్ స్కూల్ ప్రిన్సిపాల్ లహరి పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన పంపనూరు


రాహుకేతు, కాల సర్పదోష నివారణ హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం


హరిద్రాభిషేకం అలంకరణలో సర్పరూపుడు

- స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం ఆఖరి శ్రావణమాస ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి మంగళస్నానాలు అనంతరం హరిద్రాభిషేకం చేశారు. స్వామికి పసుపుతో అభిషేకం చేయించారు. అదేవిధంగా ఆశ్లేషాబలి శాంతి కార్యక్రమం అనంతరం స్వామి వారికి పంచామృతాభిషకాలు చేశారు. ఎస్కే యూనివర్సిటీ బోర్డు మెంబర్ తోపుదుర్తి నయనతారెడ్డి స్వామి మూలవిరాట్‌కు పసుపు అందిస్తూ హరిద్రాభిషేకం చేశారు. స్వామి బంగారు ముఖ కవచం తలపై పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతిదేవికి అభిషేకాలు చేశారు. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. శ్రావణమాసం ఆఖరి ఆదివారం కావడంతో ఆలయానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చారు.


ఆలయంలో ఆశ్లేషాబలిశాంతి కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి బంగారు కవచంతో ప్రదక్షిణలు చేస్తున్న తోపుదుర్తి నయనతారెడ్డి

సంఘం బలోపేతానికి కృషి చేయాలి


సమావేశానికి హాజరైన నూర్‌బాషా దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: దూదేకుల కులస్తులు ఐక్యతతో ఉంటేనే ఆర్థికంగా, రాజకీయంగా, అన్నివిధాలుగా రాణించగలమని నూర్‌బాషా దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు రమీజాబేగం అన్నారు. ఆదివారం రమీజాబేగం స్వగృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేద పిల్లల చదువు, వైద్య కోసం సహాయ సహకారాలు సంఘం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సలహాదారు ఖాసీం, అనంతపురం జిల్లా అధ్యక్షులు దస్తగిరి, ఉపాధ్యక్షులు సంజప్ప, ప్రధాన కార్యదర్శి మహబూబ్ సాబ్, తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షులు దస్తగిరి, ఉపాధ్యక్షులు ఫక్రుద్దీన్, పెద్ద హాజీ, నాయకులు కథాలప్ప, మసూద్, బాబుసాబ్, బ్రహ్మం, నిసార్ అహ్మద్, హైదర్‌వలి, జాఫర్‌సాబ్, షేక్ షా వలి, దాదా ఖలందర్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిజరూప పాదదర్శన పూజలు


అలంకరణలో రుక్మిణీ పాండురంగ విఠలస్వామి

అనంతపురం కల్చరల్: స్థానిక రామనగర్‌లోని రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిజరూప పాదదర్శన పూజలు జరిగాయి. శ్రావణ మాసంలో వచ్చిన చివరి ఏకాదశి సందర్భంగా జరిగిన పాదదర్శన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయంలో అర్చనలు, పుష్పాలంకార సేవలు జరిగాయి.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు గ్రామాల నుంచే గాక జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు.

జర్నలిస్ట్ కాలనీని పరిశీలించిన ఆర్డీఓ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి జర్నలిస్ట్ కాలనీని ఆర్డీఓ మధుసూదన్ ఆదివారం పరిశీలించారు. రాచానపల్లి నుంచి కాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆర్డీఓ సూచించారు. కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డితో వివిధ అంశాలపై ఆర్డీఓతో చర్చించారు. ఆర్డీఓ వెంట పీఆర్ డీఈ రసూల్, సర్వేయర్ ప్రతాప్‌రెడ్డి, వీఆర్ఓ రమేష్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ఆదివారం దీక్ష చేపట్టారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు కె.విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు మనోహర్, బాబ్జాన్, దివాకర్, ఓబిరెడ్డి, ఈశ్వర్, రాజ్యలక్ష్మి, దీప, భాగ్యలక్ష్మి, లింగరాజు, అంజి, తదితరులు పాల్గొన్నారు.